

డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 2 వేలు, మధ్య డెల్టాకు 1,550, పశ్చిమ డెల్టాకు 3,600 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రూ.లక్ష విరాళం



పిఠాపురం: పాద గయ క్షేత్రంలో నిత్యాన్నదానానికి బొండా సుబ్బా రావు (పిఠాపురం) సోమవారం రూ.లక్ష విరాళం అందజేశారని ఆలయ ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు.

గరిష్టం/కనిష్టం 42.0°/25.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	42.0	25.0
కాకినాడ	38.0	26.5
అమలాపురం	39.5	25.0

నేడు సీఎం జగన్ రాక

- రాత్రికి ఈతకోట చేరనున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర
- రేపు శ్రీరామ నవమి పండగ సందర్భంగా విరామం
- 18న రావులపాలెంలో మహిళలతో ముఖాముఖి
- అనంతరం యాత్ర ప్రారంభం



కొత్తపేట/రావులపాలెం: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రజలు కొద్ది రోజులుగా కళ్లల్లో ఒత్తులు వేసుకుంటూ ఎదురు చూస్తున్న తరుణం రానే వచ్చింది. జనప్రియ నేత, రాష్ట్ర సంక్షేమ, అభివృద్ధి ప్రదాత ఆగమించే సమయం ఆసన్నమైంది. వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర.. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో పూర్తి కాగా.. మంగళవారం రాత్రికి వశిష్ట గోదావరిని దాటి.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముఖ ద్వారమైన రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చేరుకోనుంది. ఈ వివరాలను కొత్తపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సోమవారం తెలిపారు. సీఎం జగన్ మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రచారం ముగించుకుని సిద్ధాంతం, వశిష్ట గోదావరి బ్రిడ్జి, రావులపాలెం మండలం గోపాలపురం మీదుగా ఈతకోట చేరుకుంటారు. అక్కడ లే అవుట్ సైటులో ఏర్పాటు చేసిన విడిదిలో బస చేస్తారు. 17న శ్రీరామ నవమి పండగ సందర్భంగా బస్సు యాత్రకు విరామం ప్రకటించి, అక్కడే విశ్రాంతి తీసుకుంటారు. 18వ తేదీ ఉదయం 8 గంటలకు రావులపాలెంలో మహిళలతో ముఖాముఖి సమావేశంలో సీఎం జగన్ మాట్లాడతారు. అనంతరం అక్కడి నుంచి 9 గంటలకు 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర ప్రారంభమవుతుంది. రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్, గౌతమి బ్రిడ్జి మీదుగా జొన్నాడ సెంటర్, మూలస్థానం, చొప్పెల్ల, చెముడులంక, మడికి మీదుగా జిల్లాలో బస్సు యాత్ర కొనసాగుతుంది. అనంతరం తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పొట్టిలంకలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుందని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి తెలిపారు. కాగా.. అనుక్షణం జన క్షేమాన్ని కాంక్షిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి మేమంతా సిద్ధమని ఉమ్మడి తూర్పుగోదావరి ప్రజానీకం నినదిస్తోంది.



ఈతకోటలో సీఎం జగన్ బస చేసే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

సీఎం బస ప్రాంతాన్ని పరిశీలించిన ఎస్పీ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం రాత్రి, బుధవారం విశ్రాంతి తీసుకునే ఈతకోటలోని లే అవుట్ ప్రాంతాన్ని కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ సోమవారం సాయంత్రం పరిశీలించారు. సీఎం బసకు కట్టుదిట్టమైన మూడంచెల భద్రతా ఏర్పాటుపై జిల్లా, డివిజన్, సర్కిల్ పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్పీ వెంట ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ (ఐఎస్‌డబ్ల్యూ) డీఎస్పీ ఆశీర్వాదం, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ, రావులపాలెం సీఐలు రామ్‌కుమార్, ఆంజనేయులు, సర్కిల్ పరిధిలోని సీలు శ్రీనివాస్ నాయక్, ఎం.అశోక్, శ్రీనివాస్ ఉన్నారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఎన్నికల నేపథ్యంలో మీడియాకు సమగ్ర సమాచారం అందించేందుకు మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు ఎన్నికల సమగ్ర సమాచారాన్ని ప్రజలకు ఎప్పటికప్పుడు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సెంటర్ ద్వారా మీడియా ప్రతినిధులకు విషయాలను సకాలంలో అందజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలోని ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడానికి ప్రసార మాధ్యమాల సహకారం ఎంతో అవసరమన్నారు. అనంతరం జిల్లాలోని నియోజక వర్గాల మ్యాపులు, ఓటర్లు, పోలింగ్ స్టేషన్లు, ఎన్నికల అధికారుల వివరాలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక బోర్డులను తిలకించారు. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకూ ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటలకు నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థుల వివరాలపై మీడియాకు బులిటెన్ విడుదల చేస్తామని తెలిపారు.


ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోలు కీలకం



శిక్షణలో మాట్లాడుతున్న డీఆర్‌వో వెంకటేశ్వర్లు

అమలాపురం రూరల్: సాధారణ ఎన్నికల నిర్వహణలో పీవో, ఏపీవోల పాత్ర అత్యంత కీలకమని డీఆర్‌వో, ఎన్నికల నిర్వహణ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్ గోదావరి భవన్‌లో పీవోలు, ఏపీవోలకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ సిబ్బందికి డీఆర్‌వో, మాస్టర్ ట్రైనీలు అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరుపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు సంబంధిత బూత్‌లో పీఓదే పూర్తి అధికారమన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో 90 నిమిషాల ముందే రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. సమయ పాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. పోలింగ్ జరుగుతున్నప్పుడు పోల్‌డే మేనేజ్‌మెంట్ సిస్టమ్ యాప్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనీలు కేవీఎస్ఎస్ఎం సుబ్బరాయ శర్మ, ఎం.శివప్రసాద్, ఎస్ఎస్ బాలరాజు ఎన్.శ్రీనివాస్ పోలిశెట్టి పాల్గొన్నారు.

ఫ్యానుగాలికి సైకిల్



- దేశం కోటలకు బీటలు
- అన్నివర్గాలలోనూ వైఎస్సార్ సీపీకి ఆదరణ
- ప్రజలలోకి చొచ్చుకుపోతున్న 'తోట'
- టీడీపీ అభ్యర్థి వేగుళ్లకు ఆదిలోనే హంసపాదు
- ఉమ్మడి కార్యాచరణకు కలసిరాని జనసేన
- ప్రజాక్షేత్రంలో పేలవంగా టీడీపీ ప్రచారం
- పోటీ నుంచి వేగుళ్ల తప్పకుంటారనే ప్రచారం



మండపేట మండలం పేకేటిపాకలులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

సాక్షి, అమలాపురం: నియోజకవర్గాల పునర్విభజన తరువాత మండపేట అసెంబ్లీ స్థానం టీడీపీకి కంచుకోటగా మారింది. 2009 నుంచి వరుసగా టీడీపీ నుంచి వేగుళ్ల జోగేశ్వరరావు ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్నారు. దీర్ఘకాలం పాటు స్థానిక సంస్థల్లో సైతం పట్టు సాధించి నియోజకవర్గాన్ని తన చెప్పు చేతల్లోకి తీసుకుంటూ పెత్తందారీగా ఆయన వ్యవహరిస్తూ వచ్చారు. అయితే 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం వచ్చాక మండపేట వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్‌గా తోట త్రిమూర్తులును నియమించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, తోట త్రిమూర్తులు ప్రజా క్షేత్రంలో చొరవతో ప్రజలకు దగ్గరవ్వడంతో టీడీపీ కంచుకోట బద్దలైంది. మండపేట మున్సిపాలిటీ, పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో తిరుగులేని విజయాలు సాధించడంతో ఇది నిరూపితమైంది. ఎమ్మెల్సీ అవకాశాన్ని అందిపుచ్చుకున్న తోట త్రిమూర్తులు నియోజకవర్గాన్ని విశేషంగా అభివృద్ధి చేశారు. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల్లో తోట అభ్యర్థిగా నియమితం కావడంతో నియోజకవర్గంలో ఎన్నికల వేడి రాజుకుంది. స్థానికంగా టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టిన ఎమ్మెల్సీ తోటకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యే పెత్తందారీ విధానాలకు చెక్ పెట్టేందుకు నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నట్టు ప్రచారంలో ఉంది. క్షేత్ర స్థాయిలో పరిస్థితులు తనకు అనుకూలంగా లేకపోవడంతో పోటీలో ఉండాలా తప్పుకోవాలా అన్న ఊగిసలాటలో ఉన్నట్టు ఏదో విషయం ప్రచారంలో ఉంది.
వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రాజకీయ చతురత, చొరవ వైఎస్సార్ సీపీ గెలుపునకు దోహదపడుతుందన్న అంచనా ఉంది. ఎమ్మెల్సీ తోట తన ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రజల మధ్య చొరవ చూపిస్తున్నారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున అనుచర గణం ఉండడం ఆయనకు కలిసి వచ్చే అంశం. మండపేట కో ఆర్డినేటర్‌గా జగన్ నియమించిన రోజుల్లో రామచంద్రపురం నుంచి వలస వచ్చారంటూ టీడీపీ చేసిన ప్రచారం ఫలితాన్నివ్వలేదు. కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, టేకి, నాగులచెరువు తదితర గ్రామాలు గతంలో రామచంద్రపురం నియోజకవర్గంలో ఉండేవి. ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్సీ తోటను స్థానికేతరుడు అంటూ తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇదే సమయంలో వివిధ కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి తోట వారికి లబ్ధి చేకూరేలా చేస్తున్నారు. ఉదాహరణకు కపిలేశ్వరపురం మండలంలో సాంకేతిక కారణాలతో నిలిచిన డ్వాక్రా సంఘాల రుణాల మంజూరు సమస్యను పరిష్కరించారు. లంక గ్రామాల్లో వరదల సమయంలో పంటుపై స్వయంగా వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మండపేట మండలం కేశవరం గ్రామ శివారు కుర్రావారి మెట్టలో టీడీపీ హయాంలో ఇళ్ల పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకోగా పట్టాలు కలిగిన వారికి స్థలాలను కేటాయించే ప్రయత్నాలను ప్రారంభించడంతో మేజర్ పంచాయతీ అయిన కేశవరంలో ఎమ్మెల్సీ తోటకు సానుకూలత మరింత పెరిగింది. దళిత, శెట్టిబలిజ, ఇతర సామాజిక వర్గాల్లో మంచి పట్టు సాధించడంతో ఎన్నికల ప్రచారం సందడిగా మారింది. మండపేట పట్టణాభివృద్ధికి విశేషంగా కృషి చేయడంతో ఎమ్మెల్సీ తోటకు పట్టణ ప్రజలు అండగా నిలుస్తున్నారు. రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం మండలాలకు చెందిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ తోటకు మద్దతుగా వైఎస్సార్ సీపీలో చేరడంతో ఎన్నికల ప్రచారం మరింత జోష్ అందుకుంది. మండపేట పట్టణ నడిబొడ్డున అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిరావ్ పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడంతో మహనీయులను ఆరాధించే సామాజిక వర్గీయులు ఎమ్మెల్సీ తోటపై ప్రశంసలు కురిపించారు. ఈ నెల ఏడో తేదీన మండపేట పట్టణంలో నిర్వహించిన బీసీ సదస్సుకు ప్రజలు బ్రహ్మరథం పట్టడంతో ఎన్నికల ప్రచారం మరింత ఊపందుకుంది.



కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లిలో వృద్ధుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

ప్రచారంలో వేగుళ్ల వెనుకబాటు

2004లో జరిగిన ఎన్నికలలో వేగుళ్ల జోగేశ్వరరావు ఆలమూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి బిక్కిన కృష్ణార్జున చౌదరి చేతిలో పరాజయం పాలయ్యారు. పునర్విభజనలో ఆలమూరు మండలం కొత్తపేటలో చేరింది. కొత్తగా మండపేట నియోజకవర్గం ఏర్పడింది. నాటి నుంచి ఇక్కడ జోగేశ్వరరావు హవా నడుస్తూ వచ్చింది. కానీ ఇప్పుడా పరిస్థితి మచ్చుకైనా లేదు. స్థానిక సంస్థల ఎన్నికల ఓటమి నుంచి టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు తేరుకోలేనట్టుగా ఆయన ప్రచారం సాగుతోంది. ఆయన ప్రచారం సాగుతున్న తీరు చూస్తుంటే గతంలో ఉన్నంత పట్టు లేదని తెలుస్తోంది. ఇక్కడ టీడీపీకి జోగేశ్వరరావు ఆర్థికపరమైన బలం తప్ప మరే అవకాశాలు ఆ పార్టీకి కానరావడం లేదు. ఎన్నికలప్పుడు మాత్రమే గ్రామాల్లో పర్యటించడం, సమస్యలు వచ్చినప్పుడు దూరంగా ఉండంతో ప్రజల్లో వ్యతిరేకత ఉంది. ప్రచారం పేలవంగా సాగుతుండడంతో ఆయన కొత్త ఎత్తులు మొదలు పెట్టారు. మండపేట, కపిలేశ్వరపురం మండలాల్లో పర్యటిస్తుండగా వీధిలో కనిపించిన వారికల్లా టీడీపీ కండువాలను కప్పేశారు. పార్టీలో చేరారంటూ మరుసటి రోజు టీడీపీ అనుకూల మీడియాలో రావడంతో వారు తాము వైఎస్సార్ సీపీలోనే ఉన్నామని టీడీపీలో చేరామంటూ జరుగుతున్న ప్రచారం సరికాదంటూ ప్రకటనలు ఇచ్చుకునే పరిస్థితులు తెచ్చిపెట్టారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు టీడీపీకి ప్రజాప్రతినిధులంటూ లేకపోవడంతో జనం పలుచగా ఉంటున్నారు.

జనసేనతో కానరాని సఖ్యత

టీడీపీ జనసేన మధ్య గత కొద్ది నెలలుగా పొసగని పరిస్థితులు కొనసాగుతున్నాయి. మండపేటలో నిర్వహించిన టీడీపీ జిల్లా స్థాయి సమావేశంలో టీడీపీ అభ్యర్థిగా జోగేశ్వరరావును చంద్రబాబు ఏకపక్షంగా ప్రకటించారు. దీంతో జనసేన నియోజకవర్గ నాయకులు వేగుళ్ల లీలాకృష్ణ, తన కార్యకర్తలంతా ఉమ్మడి ప్రచారానికి నేటి వరకూ దూరంగానే ఉన్నారు. తర్వాత సైతం జోగేశ్వరరావునే అభ్యర్థిగా నిర్ణయించడంతో లీలాకృష్ణ రాజకీయ కార్యాచరణకు దూరంగా ఉంటూ వస్తున్నారు. మార్చి 18న స్వయంగా విలేకరుల సమావేశంలో లీలాకృష్ణ సీటు కేటాయింపుపై తన అసహనాన్ని బహిరంగంగా ప్రకటిస్తూ పవన్ కల్యాణ్ నుంచి స్పష్టత వచ్చే వరకూ ఉమ్మడి కార్యాచరణకు వెళ్లేది లేదన్నారు. నియోజకవర్గంలోని 43 గ్రామాలకు సుమారు 30 గ్రామాల్లో టీడీపీ, జనసేన మధ్య విబేధాలున్నాయి. ఉమ్మడి జిల్లా పర్యటనలో ఉన్న పవన్‌కల్యాణ్, జనసేన నాయకులు నాగబాబు, టీడీపీ అధినేత చంద్రబాబులతో విడివిడిగా పలుమార్లు లీలాకృష్ణ, జోగేశ్వరరావులు మంతనాలు జరిపినా ఉమ్మడి కార్యాచరణ నేటికీ ప్రారంభం కాలేదు.

జగన్‌పై దాడి వెనుక కుట్ర



కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

అమలాపురం టౌన్: విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌పై జరిగిన రాయి దాడి వెనుక కుట్ర దాగి ఉందని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావు అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎన్నో జనాకర్షక పథకాలతో జననేతగా ఎదిగిన జగన్‌కు ప్రజలందరి మద్దతు ఉందన్నారు. ఆయన సభలకు వస్తున్న లక్షల మంది జనాన్ని చూసి ఓర్వలేనితనంతో ప్రతిపక్షాలు ఈ దాడికి పాల్పడ్డాయని ఆరోపించారు. ఈ దాడిలో టీడీపీ, జనసేన పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. జగన్‌పై దాడి జరగడమంటే రాష్ట్రంలో ఆయనను అభిమానించే కోట్లాది మంది జనంపై జరిగినట్లేనని ఎమ్మెల్సీ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కుడుపూడి త్రినాథ్, పార్టీ నాయకులు ముంగర ప్రసాద్, కుడుపూడి వెంకటేష్, యనమదల కరుణాకర్ పాల్గొన్నారు.

కాపు నేస్తంతో మహిళలకు ఆర్థిక భరోసా

- చంద్రబాబు పాలనలో చేసింది శూన్యం
- ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్



మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన కార్యకర్తలు

అల్లవరం: వైఎస్సార్ కాపు నేస్తం పథకం ద్వారా పేదింటి కాపు మహిళలకు ప్రతి ఏటా రూ.15 వేలు అందజేసి, వారికి ఆర్థిక భరోసా కల్పించామని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. కొమరగిరిపట్నం పంచాయతీ పరిధిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొనుకు బాపూజీ సారథ్యంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత బెండమూర్లంక సెంటర్‌లో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణతో కలసి ప్రచారం చేశారు. విశ్వరూప్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికలలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రాపాక వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు కాపులకు చేసింది శూన్యమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లలో రూ.3.57 లక్షల మంది కాపు మహిళలకు రూ.2,688 కోట్లు అందించామన్నారు. కాగా.. ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి విశ్వరూప్ సమక్షంలో సుంకరవారిపాలెం, దైవాలపాలేనికి చెందిన 20 మంది జనసేన కార్యకర్తలు, టీడీపీకి చెందిన మరో 20 మంది కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు కొనుకు బాపూజీ, సర్పంచ్ రాకాప విజయలక్ష్మి, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీను, ఆలయ చైర్మన్ నామన సిద్ధాంతి, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, సొసైటీ చైర్మన్ అల్లూరి సురేష్‌రాజు, డైరెక్టర్ బొంతు సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ గునిశెట్టి చినబాబు, గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కడలి లక్ష్మణరావు, కొనుకు బాబురావు, పిండి మధు, నిమ్మకాయల శేఖర్, ఆకుల మధు పాల్గొన్నారు.

నేడు శ్లాస్ పరీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో కమలకుమారి

అమలాపురం టౌన్: స్టూడెంట్ లెర్నింగ్ అచీవ్‌మెంట్ సర్వే (శ్లాస్) పరీక్షను జిల్లాలో మంగళవారం సమర్థవంతంగా నిర్వహించాలని సీఆర్‌ఎంటీలు, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు డీఈవో ఎం.కమలకుమారి సూచించారు. డీసీఈబీ కార్యదర్శి బి.హనుమంతరావు అధ్యక్షతన స్థానిక విట్స్ స్కూలు ఆవరణలో సోమవారం సాయంత్రం శ్లాస్ పరీక్ష నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో కమలకుమారి మాట్లాడుతూ 4వ తరగతి విద్యార్థులకు నిర్వహించే శ్లాష్ పరీక్ష ద్వారా వారి అభ్యాసన సామర్థ్యాలను అంచనా వేసే వీలుంటుందన్నారు. జిల్లా వ్యాప్తంగా 157 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పిల్లి రాంబాబు మాట్లాడుతూ దీని ద్వారా ఉపాధ్యాయులకు శిక్షణ, విద్యార్థులకు అభ్యాసన సామర్థ్యాల పెంపునకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన జరుగుతుందన్నారు. డీసీఈబీ కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పరీక్ష పేపర్లను సరఫరా చేస్తామని, ఓఎంఆర్ బేస్డ్ విధానంలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు. సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు, మండల విద్యాశాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు ఈ శ్లాస్ పరీక్షను పర్యవేక్షిస్తారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 3,168 మంది విద్యార్థులు ఈ పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. డీఈవో కార్యాలయ ఏపీవో బి.ఆదినారాయణ, నోడల్ సీఆర్పీ వెంకట్‌లు శ్లాష్ పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. మండల విద్యాశాఖాధికారులు ఎస్.దుర్గాదేవి, మెండి శ్రీనుబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

- పార్టీ శ్రేణులు సమన్వయంతో సాగాలి
- మలికిపురంలో ఎంపీ మిథున్ రెడ్డి



ఎంపీ మిథున్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావు, కేఎస్ఎన్ రాజు

మలికిపురం: రాబోయే ఎన్నికలలో జిల్లాలోని పార్లమెంట్ స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో విజయ కేతనం ఎగురవేద్దామని వైఎస్సార్ సీపీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్, ఎంపీ మిథున్ రెడ్డి అన్నారు. మలికిపురంలోని కేఎస్ఎన్ రాజు ఇంటి ప్రాంగణంలో సోమవారం రాజోలు నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. కేఎస్ఎన్ రాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మిథున్ రెడ్డి మాట్లాడుతూ అమలాపురం ఎంపీ, రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థులుగా అనుభవజ్ఞులైన రాపాక వరప్రసాదరావు, గొల్లపల్లి సూర్యారావును నిలిపామని, వారిని గెలిపించాలని కోరారు. జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, ఓట్లు అడగాలన్నారు. పార్టీ నేతలందరూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలు, మన ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్ సభలకు వస్తున్న జనాదరణను చూసి ఓర్వలేక విజయవాడలో జగన్‌పై రాళ్లతో దాడి చేశారన్నారు. ఎంపీ అభ్యర్థి రాపాక, ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యారావు ప్రసంగించారు. సమావేశంలో డీసీఎంఎస్ డైరెక్టర్ అడబాల బ్రహ్మాజీ రావు, జెడ్పీటీసీలు బల్ల ప్రసన్న కుమారి, కసిరెడ్డి అంజిబాబు, దొండపాటి అన్నపూర్ణ, మట్టా శైలజ, ఎంపీపీలు వీరా మల్లిబాబు, కుసుమ వనజ కుమారి, జిల్లా గ్రీవెన్స్ సెల్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్, నాయకులు సూరిశెట్టిబాబు, పాటి శివ కుమార్, గెద్దం తులసీ భాస్కరరావు, కంచర్ల శేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధి కూలీ మృతి



వెంకటేశ్వరరావు మృతదేహం

తుని రూరల్: తుని మండలం టి.తిమ్మాపురం గ్రామానికి చెందిన మదినే వెంకటేశ్వరరావు (37) ఉపాధి పని చేస్తూ మృతి చెందినట్టు సోమవారం ఏపీఓ పసుపులేటి నారాయణరావు తెలిపారు. గ్రామంలోని పెరిశెట్టి చెరువులో ఉపాధి పనులకు వెంకటేశ్వరరావు వచ్చాడు. పని మొదలు పెట్టిన గంట తర్వాత కళ్లు తిరిగి పడిపోయాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని తోటి కూలీల సాయంతో బంధువులు ఆస్పత్రికి తీసుకువెళుతుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. వెంకటేశ్వరరావు గుండెపోటుతో మృతి చెందినట్టు భావిస్తున్నారు. కాగా.. అతడి పదేళ్ల కుమారుడు గత నెలలో చనిపోయాడు. మృతుడికి భార్య ఉంది.

నూతన పరిజ్ఞానం పెంపొందించుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హేమంత్ సింగ్

గండేపల్లి: విద్యార్థులు నూతన పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ పరుచూరి కృష్ణారావు అన్నారు. సూరంపాలెం ప్రగతి ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్-3డి అనే అంశంపై సోమవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వారణాసికి చెందిన కార్పొరేట్ ట్రైనర్, టెక్నిక్స్ ఐబీటీ హేమంత్ సింగ్ మాట్లాడుతూ సివిల్-3డి నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎంవీ హరనాథబాబు, ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎస్‌ఈబీ నిఘా

అమలాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) నిఘా అత్యంత నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ఉండాలని మంగళగిరి ఎస్‌ఈబీ ఎస్పీ ఎన్‌వీఎస్ మూర్తి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎస్‌ఈబీ ఎన్నికల నిఘా కోసం ఇప్పటి వరకూ తీసుకున్న చర్యలపై ఆయన సమీక్షించారు. వాటిని జిల్లా ఎస్‌ఈబీ ఇన్‌చార్జి, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా వివరించారు. ఎస్పీ మూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌ఈబీ నిఘాను విస్తృతం చేయాలన్నారు. ప్రతి అధికారి, సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఎన్నికల సందర్భంగా పోలింగ్ రోజు సిబ్బంది నిర్వర్తించాల్సిన విధులపై పలు సూచనలు చేశారు. ఏదైనా సమస్య గురించి వచ్చిన సమాచారాన్ని అందుకున్న మరు క్షణమే పరిష్కారం ఒదుకు స్పందించాలన్నారు.

యుగానికి ఒక్కడు..

- సమాజంలో అన్యాయాలపై కత్తి దూసిన కందుకూరి
- రచనలు, నాటకాలతో ప్రజలలో చైతన్యం
- నేడు ఆ మహానుభావుని జయంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): స్త్రీ విద్య కోసం ఉద్యమించిన జ్ఞాన ప్రదాత, బాలికల పాఠశాలను ప్రారంభించిన స్ఫూర్తిదాత, బాల వితంతువులకు పునర్వివాహాలు జరిపించిన యుగపురుషుడు, సమాజ సేవకు హితకారిణిని స్థాపించిన సేవామూర్తి కందుకూరి వీరేశలింగం. వ్యవహార ధర్మబోధిని నాటకం ద్వారా సమాజంలో అన్యాయాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు 1848 ఏప్రిల్ 16న వీరేశలింగం జన్మించారు. ఆ మహానుభావుని జయంతి (నాటక రంగ దినోత్సవం) సందర్భంగా మంగళవారం వేడుకలకు ఏర్పాట్లు చేశారు.

రాజమహేంద్రవరం కేంద్రంగా..

సామాజిక చైతన్యానికి ఒక వైపు, పురాణ సాహిత్యంపై సామాన్య ప్రజలలో ఆసక్తి కలిగించడానికి మరోవైపు నాటకరంగం దృష్టి సారించింది. రాజమహేంద్రవరం కేంద్రంగా యుగపురుషుడు కందుకూరి వీరేశలింగం రచించిన తొలి ప్రదర్శిత నాటకం వ్యవహార ధర్మబోధిని ఆనాడు సంచలనం రేపింది. సామాజిక రుగ్మతలపై కందుకూరి సంధించిన మరో అస్త్రం బ్రాహ్మీవివాహం ఛాందస వాదులను కలవరపడేటట్లు చేసింది. అదే సమయంలో కళింగ ప్రాంతంలో గురజాడ రచించిన కన్యాశుల్కం నిత్య నూతన పరిమళాలను వెదజల్లుతోంది. కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం, తిరుపతి వేంకట కవులు పౌరాణిక నాటకాలతో తెలుగువారిని ఆకట్టుకుంటే, హాస్యబ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు, ఇతర ప్రముఖులు నాటకరంగాన్ని పరిపుష్టం చేశారు.

నాటక రంగ దినోత్సవం

నాటకరంగం తన ప్రాభవాన్ని కోల్పోకూడదని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అప్పటి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అభ్యర్థనపై యుగపురుషుడు కందుకూరి జన్మదినాన్ని నాటకరంగ దినోత్సవంగా ప్రకటించారు. అప్పటి నుంచి ఏటా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



కందుకూరి దంపతులు నివసించిన ఇల్లు (నేటి నాటక నిలయం)

మొట్టమొదటి వితంతు వివాహం

కందుకూరి వీరేశలింగం 1881 డిసెంబర్ 11న తన ఇంటిలో మొట్టమొదటి వితంతు విహహం జరిపించారు. బాల వితంతు గౌరమ్మకు రేబూడికి చెందిన గోగులపాటి శ్రీరాములుతో పెళ్లి చేశారు. వంట చేయడానికి ఎవ్వరూ ముందుకు రాకపోతే వీరేశలింగం భార్య రాజ్యలక్ష్మమ్మ ఆ బాధ్యత తీసుకున్నారు. స్వయంగా వంటలు చేసి, ఆ కార్యక్రమానికి వచ్చిన వారికి వడ్డించారు.



కందుకూరి వీరేశలింగం రచించిన పుస్తకాలు

కందుకూరి రచనలు

మార్కండేయ మకుటం శతకం, శ్రీరాజమహేంద్ర పురవర గోపాల వంటి పద్య కావ్యాలు, వ్యవహార ధర్మ బోధిని, చమత్కార రత్నావళి, అభిజ్ఞాన శకుంతులం వంటి నాటకాలు, రాజశేఖర చరిత్రము, సత్యరాజా పూర్వదేశ యాత్రలు వంటి రచనలు, సాంఘిక దురాచారాలపై అనేక ప్రసహనాలను కందుకూరి రచించారు.

తెలుగు నాటక నిలయం ప్రారంభం



నాటకం లేకపోతే అది సాహిత్యమే కాదు. తెలుగు నాటక రంగం కూడా రాజమహేంద్రవరంలోనే నడక నేర్చింది. ఈ నేపథ్యంలో తెలుగు నాటక నిలయం ప్రారంభించాం. ఆనంద గార్డెన్‌లోని కందుకూరి వీరేశలింగం నివసించిన ఇంట్లో జక్కంపూడి విజయలక్ష్మి ప్రోత్సాహంతో లక్ష్మీపార్వతితో ఈ నాటక నిలయాన్ని ప్రారంభించాం. తెలుగు నాటకంపై జరిగిన పరిశోధనలు, సాహిత్యం తదితర వాటిని ఒకచోట నిక్షిప్తం చేయాలన్నదే ప్రధాన ఉద్దేశం. కందుకూరి చేసిన సేవలు నేటి తరానికి తెలియాల్సి ఉంది. ఇదేదో కందుకూరి కుటుంబానికి చెందిన కార్యక్రమం మాదిరిగా కాకుండా, రాష్ట్ర ప్రజలందరూ పండగలా నిర్వహించుకోవాలి.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, కందుకూరి నాటక సాహిత్య పరిశోధకుడు

రాజ్‌కుమార్ వుడయార్‌కు మహాశిల్పి అవార్డు



హైదరాబాద్‌లో రాజ్‌కుమార్ వుడయార్‌కు అవార్డు అందిస్తున్న ప్రముఖులు

కొత్తపేట: ప్రముఖ అంతర్జాతీయ శిల్పి డాక్టర్ డి.రాజ్‌కుమార్ వుడయార్‌కు తెలంగాణ ప్రభుత్వం, యువ ఆర్ట్ థియేటర్ సంయుక్త ఆధ్వర్యంలో మహాశిల్పి అవార్డు ప్రదానం చేశారు. వివిధ రంగాలలో నిష్ణాతులకు 2024 ఉగాది జాతీయ పురస్కారాలు ప్రదానం చేశారు. దానిలో భాగంగా శిల్పకళారంగానికి గాను కొత్తపేటకు చెందిన శిల్పి రాజ్‌కుమార్ వుడయార్‌ను ఎంపిక చేశారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ వేదికపై ఆదివారం రాత్రి మాజీ కేంద్రమంత్రి ఎస్.వేణుగోపాలాచారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కె.పుష్పలీల చేతుల మీదుగా వుడయార్‌కు పురస్కారం అందజేశారు. కాగా.. అవార్డు అందుకున్న వుడయార్‌ను స్థానిక కళాసాహితి సభ్యులు అభినందించారు. కళాసాహితి అధ్యక్షుడు పెన్మెత్స హరిహర దేవళరాజు, ప్రధాన కార్యదర్శి గిడ్డి సుబ్బారావు, సభ్యులు ఏబీసీ దేవ్, షేక్ గౌస్, ఖాజామొహిద్దిన్, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, కళా స్రవంతి సంగీత, నృత్య, వాయిద్య కళాకారుల సంఘం అధ్యక్షుడు కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్ తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

నడక కవి నరసింహమూర్తికి సత్కారం



కవి నరసింహమూర్తిని సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే వరప్రసాదరావు, కాపు నాయకులు

అమలాపురం టౌన్: నడక నానీల పేరుతో 103 పుస్తకాలు రాయడమే కాకుండా అందులో 8 పుస్తకాలను జగన్ ప్రతిపక్ష నేతగా చేసిన పాదయాత్రను నడక చైతన్య కోణానికి అన్వయించించిన పట్టణానికి కవి డాక్టర్ నల్లా నరసింహమూర్తిని వైఎస్సార్ సీపీ కాపుల సమ్మేళన సభ అభినందించింది. స్థానిక యెండూరి కన్వెన్షన్ హాలులో ఆదివారం రాత్రి జరిగిన కాపుల సమ్మేళన సభలో కవి నల్లాను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు ఘనంగా సత్కరించారు. ముఖ్యమంత్రి జగన్ అభిమానిగా, నడక చైతన్యాన్ని నింపే కవిగా ఆయన రాసిన నడక నానీల పుస్తకాలు నడక గొప్పతనాన్ని తెలియజేస్తున్నాయని కొనియాడారు. నడక నానీల పేరుతో 103 పుస్తకాలు పూర్తి చేసిన సందర్భంగా కవి నల్లాకు జాతీయ పురస్కారం లభించింది. ఈ నేపథ్యంలో ఆయనను పార్టీ కాపుల సమ్మేళన సభలో ఆ సామాజిక వర్గం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, చిక్కాల రవి శంకర్, సూదా గణపతి, తోట శ్రీను, కల్వకొలను ఉమ, గుత్రం రాజా, నల్లా ప్రసాద్ పాల్గొన్నారు.

కోవా సారె.. కళ్లు చెదిరే..

- సీతమ్మకు తియ్యటి విందు సిద్ధం
- ఆకట్టుకుంటున్న కోవా స్వీట్లు




కోవాతో తయారు చేసిన వివిధ రకాల స్వీట్లు


పి.గన్నవరం: స్థానిక పాత అక్విడెక్టు వద్ద శ్రీపట్టాభి రాముని ఆలయంలో ఈ నెల 17వ తేదీన జరగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవానికి ఆలయ ధర్మకర్తలు పేరిచర్ల భీమరాజు, సత్యవాణి దంపతులు కోవా స్వీట్ల సారెను సిద్ధం చేశారు. కల్యాణంలో శ్రీరాముని తరపున సీతమ్మ వారికి ఈ సారె (కంత)ను సమర్పిస్తారు. ఇందులో భాగంగా వివిధ రకాల ఫలాలు, పుష్పాలు, కూరగాయలు, పంచె, చీర, పర్ణశాల వంటి ఆకృతుల్లో కోవాతో తయారు చేసిన స్వీట్లు భక్తులకు కనువిందు చేస్తున్నాయి. గత 15 ఏళ్లుగా ప్రతి ఏటా కోవాతో ఈ విధంగా సారెను తయారు చేయించి సీతమ్మకు సమర్పిస్తున్నట్టు సత్యవాణి తెలిపారు.



పూల సజ్జ



పర్ణశాల



గుమ్మడి కాయలు

20 రోజుల ముందు నుంచీ..

పట్టాభి రామస్వామి ఆలయ ధర్మకర్తలు భీమరాజు, సత్యవాణి దంపతుల ఆధ్వర్యంలో స్వామికి ఏటా అత్యంత వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 20 రోజుల ముందు నుంచీ సీతమ్మకు సమర్పించేందుకు 100 రకాలకు పైగా కోవాతో స్వీట్లు, పిండి వంటలు తయారు చేయిస్తారు. స్వీట్లు, పిండి వంటల తయారీలో స్థానిక మహిళా భక్తులు సేవలు అందిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవంతో పాటు కోవా కంతను తిలకించేందుకు ఏటా పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి



లోవదుర్గ (ఫైల్)

ఏలేశ్వరం: మండలంలోని యర్రవరం వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందింది. భీమవరానికి చెందిన ఎలుబోలు లోవ దుర్గ రెండు నెలల క్రితం తన పుట్టింటికి ఏలేశ్వరం వచ్చింది. సోమవారం తెల్లవారుజామున వాడపల్లి వెంకన్నబాబు దర్శనం కోసం ఆటోలో మరికొందరు మహిళలతో కలిసి బయలు దేరింది. యర్రవరం జాతీయ రహదారిపై ఫారెస్టు చెక్‌పోస్టు సమీపానికి వచ్చే సరికీ వాంతలు కావడంతో తలను ఆటో నుంచి బయటకు పెట్టింది. ఆ సమయంలో రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు తీవ్ర గాయమైన ఆమెను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్యాయత్నం కేసులో ఐదేళ్ల జైలు

కాకినాడ లీగల్: తండ్రీ కుమారులపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎంపీఎస్ పద్మజ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ సాంబమూర్తి నగర్ చెందిన జొన్నాడ శివయ్య, అతడి కుమాడు రామ్ కల్యాణ్ కుమార్‌లపై కాకినాడ సూర్యనారాయణపురానికి చెందిన రౌడీషీటర్ చిమ్మ చిట్టిబాబు 2022లో కత్తితో దాడి చేశాడు. దీనిపై శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో చిట్టిబాబుపై నేరం రుజువుకావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

తలుపులమ్మ పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠ



పూర్ణాహుతిలో పాల్గొన్న డీసీ విశ్వనాథరాజు, పండితులు



తలుపులమ్మవారి పంచలోహ విగ్రహాలు

తుని రూరల్: లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠోత్సవం సోమవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. 2022 డిసెంబర్‌లో రూ.15 కోట్లతో లోవ దేవస్థానంలో ప్రధాన ఆలయం, మహా మంటప పునర్నిర్మాణం, తొమ్మిది అంతస్తుల రాజగోపురం నిర్మాణ పనులు చేపట్టడంతో అమ్మవారి పంచలోహ విగ్రహాల దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఇటీవల ఆలయ పునర్నిర్మాణం పూర్తి కావడంతో ప్రధాన గర్భాలయంలో అమ్మవారి దర్శనాలను పునరుద్ధరించిన విషయం తెలిసిందే. దీంతో అమ్మవారి పంచలోహ విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. అనంతరం వేద పండితులు, ప్రధాన అర్చకులు, అర్చకులు శాంతి హోమం జరిపారు. ఇన్‌చార్జి డీసీ, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాథరాజు పట్టు వస్త్రాలు సమర్పించగా, వైభవంగా పూర్ణాహుతి నిర్వహించారు. ఈ సందర్భంగా పంచలోహ విగ్రహాలకు విశేష అలంకరణలు చేశారు. ఐదు గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తలుపులమ్మకు కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మశ్రీ ఈమని నాగ వెంకటకృష్ణ, వింజమూరి రామం పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని ఎస్సై పి.బుజ్జిబాబు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ బలభద్రపురం – సామర్లకోట కెనాల్ గట్టు పక్కనే గల తుప్పలతో మృతదేహం ఉందన్నారు. ఒంటి మీద ప్యాంట్ మాత్రమే ఉందని, కుడి చేతికి ఎరుపు తాడు కట్టి ఉందన్నారు. అతడి వయసు సుమారు 25 నుంచి 35 ఏళ్లు ఉంటుందని భావిస్తున్నామన్నారు. మృతదేహం ఆచూకీ తెలిసినవారు బిక్కవోలు పోలీసులు తెలియజేయాలని కోరారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ 90.90 లక్షలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించగా రూ.90,90,850 వచ్చినట్టు ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్ కుమార్ తెలిపారు. 26 రోజులకు గాను ప్రధాన హుండీల నుంచి రూ.70,39,801, అన్న ప్రసాదం హుండీల నుంచి మరో రూ.20,51,049 లభించిందన్నారు. విదేశీ కరెన్సీతో పాటు 22 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండిని భక్తులు సమర్పించారన్నారు. అలాగే ఆలయ క్షేత్రపాలకుడు అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయ హుండీలను లెక్కించగా రూ.2,33,164 వచ్చిందన్నారు. అయితే హుండీలో పువ్వులు, తులసి మాలలు వేయడంతో కరెన్సీ నోట్లు పాడవుతున్నాయని, భక్తులు గమనించాలని కోరారు. దేవదాయ ధర్మదాయశాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈవో భూపతిరాజు కిషోర్ కుమార్, డీఈఓ, అసిస్టెంట్ కమిషనర్ డి.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడిగా కొండలరావు



కాకినాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యర్రంశెట్టి కొండలరావు ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవో హోంలో సోమవారం ఉమ్మడి జిల్లాల ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మహాసభ జరిగింది. కార్యక్రమానికి రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి కేఆర్ ఆంజనేయులు అధ్యక్షత వహించగా రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.నరసింహారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. అనంతరం జిల్లా కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా యర్రంశెట్టి కొండలరావుతో పాటు కార్యదర్శిగా ఓఆర్ బాబు ఎన్నికయ్యారు. రాజమహేంద్రవరం కార్యదర్శిగా నకిలే సతీష్, సంయుక్త కార్యదర్శిగా నారాయణను ఎన్నుకున్నారు. సమావేశంలో కాకినాడ జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, కాకినాడ మెడికల్ ఆఫీసర్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ సాత్ స్టేషన్ తనిఖీ

రాజమహేంద్రవరం రూరల్/రాజానగరం: రాజమహేంద్రవరం ఎస్‌ఈబీ సాత్‌స్టేషన్‌ను సోమవారం రాష్ట్ర ఎస్‌ఈబీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డులు, కేసు ఫైల్స్, ప్రాపర్టీలను పరిశీలించారు. గత ఏడాది డిసెంబర్ 25 నుంచి ఇప్పటి వరకు 281 కేసులు నమోదు చేసి, 291 మందిని అరెస్టు చేసి, 7,374 లీటర్ల సారాను, 1048.3 లీటర్ల దేశీయలిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ పి.హనుశ్రీ తెలిపారు. అనంతరం రాజానగరం మండలం తూర్పుగోన గూడెంలోని చెక్‌పోస్టును రాష్ట్ర ఎస్‌ఈబీ ఎస్‌టీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయ తనిఖీచేశారు. చెక్‌పోస్టుల వద్ద ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలన్నారు.